# 'పాతబొమ్మ'

ప్రముఖ పాత్రికేయుడు, కవీ అయిన ఇంద్రగంటి శ్రీకాంతశర్మగారు ఓ పాత కుర్చీపై కవిత రాశారు.

"ఎన్నాళ్ళనుంచో చూస్తున్నాను
ఎదురింటి మేడమీద పడమటి వసారాలో
పడక కుర్చీని.
దుమ్ము... ధూళీ...
ఆవైపు ఎవరూ రారు
అందులో కూర్చోరు
హేమంత ప్రదోష వేళలాగ
ఒంటరితనాన్ని కప్పుకుని కూర్చుంది
ఎంతో పరిచయమున్న వ్యక్తి జ్ఞాపకం అది.
నిద్రపట్టని ముసలి కళ్లతో
అందులో ఎవరో అదృశ్యంగా కూర్చుని
వేకువ కోసం ఎదురుచూస్తున్నారేమో!
తలవైపు అరిగి నునుపుదేరిన మరక
ఎన్ని తరాల ఏ ఆలోచనలకు చిహ్నం?
మేడ కింద నించి పిల్లల కేరింతలు
వాళ్లు పరిగెత్తుకుంటూ వచ్చి
చెంగున గెంతి తన వొళ్లో కూర్చోరాదూ?
ఆ చీకటి వైపున దీపం వెలిగించరాదూ?
అని – ఎదురుచూస్తున్నట్టే ఉంటుంది" ఇదీ ఆ కవిత.

పై కవిత చదివినప్పుడల్లా... నాకు ఓ దృశ్యం వెంటనే స్ఫురణకొస్తుంది. ఆ దృశ్యం ముప్ఫై సంవత్సరాల పాతదైనా నా మెదడు పొరల్లో పదిలంగా వుంది. మా బాషా (షౌకత్ అలీ) ప్రకాష్‌నగర్‌లో వుండేవాడు. నేను సి. క్యాంపు. అది ఊరికి ఆ చివరైతే నాది ఈ చివర. దాదాపు నాలుగు కిలోమీటర్లు. సాయంకాలమైతే మేమంతా మా కర్నూలు ఎస్.టి.బి.సి. కాలేజీ గ్రౌండ్‌లో కలిసేవాళ్లం. నేను అయిదున్నర ప్రాంతంలో సైకిలు మీద

వెళ్లేవాణ్ణి. గెస్టోస్ సర్కిల్ దాటిం తర్వాత ఓ పాత ఇల్లు వుండేది. బయట వరండాలో ఇద్దరు వృద్ధ దంపతులు. ఆమె నుదుటున రూపాయి కాసంత బొట్టు. దాదాపు ఎప్పుడూ ఆకుపచ్చ నేత చీర. ఆయన ఓ ఊతకర్ర గెడ్డానికానించుకుని పైన చెప్పిన శ్రీకాంతశర్మగారు వర్ణించిన కుర్చీలాంటి కుర్చీల్లో పంచె బనియనుతో కనబడేవారు.

నేను వెళ్తూ వెళ్తూ తల అటు తిప్పి చూడ్డం అలవాటై వుండేది.

వాళ్లు మాట్లాడుకోడం చాలా అరుదుగా చూసేవాణ్ణి. ఇద్దరూ మౌనంగా రోడ్డువైపు ఎవరికోసమో ఎదురు చూస్తున్నట్టుగా అనిపించేది.

"అందులో ఎవరో అదృశ్యంగా కూచుని వేకువ కోసం ఎదురు చూస్తున్నారేమో?" అన్న శ్రీకాంతశర్మగారి వాక్యాలు చదివినప్పుడు నేను ఆ దంపతుల్లోని వృద్ధుణ్ణి వూహించుకోడం జరుగుతుంది.

కొన్నాళ్లకి ఆమె కనిపించడం మానేసింది. అతనొక్కడే శూన్య నేత్రాల్తో... అదే ఆహార్యంతో... అదే కుర్చీలో కనిపించేవాడు.

పక్కన ఆవిడ శూన్యం.

ఖాళీకుర్చీ... ఆమె లేనితనం... నాకు ఏదో తెలీని లోటు...(మీరు గమనించారో లేదో మనం రోజూ వెళ్లేదారిలో రోడ్డు పక్కని పెద్ద వృక్షాన్ని నరికేస్తే ఆ శూన్యం మన మనసులో ఎంత కలత గలగజేస్తుందో! ఏదో తెలీని దారిలోంచీ వెళ్తున్నట్టు అనిపిస్తుంది.)

అదుగో సరిగ్గా అలాంటి శూన్యం...

నా ఆత్మీయురాలు ఎవరో నా జీవితంనించీ తప్పుకున్నట్టు ఖేదం కలిగేది. వాళ్ల ఊళ్లూ పేర్లూ తెలియవు. వాళ్లతో ఏనాడూ పన్నెత్తి మాట్లాడింది లేదు. సైకిల్‌పై వెళ్తూ వెళ్తూ ఓ రెండుక్షణాల కాలం తల తిప్పి వాళ్లని చూడ్డం అంతే.

అదో విచిత్ర దృశ్య బంధం.

నా జ్ఞాపకాల ఫొటోల్లో అదో పాత ఆత్మీయ చిత్రం.

కొన్నాళ్లకి ఆయనా కనిపించడం మానేశాడు. ఆయనతోపాటు ఆ రెండు కుర్చీలూ మాయం. ఆ దంపతులు మిగిల్చిన శూన్యం అలవాటైపోయింది. ఈరోజుకి ఆ ఇల్లు కూడా లేదు.

* * *

***మనిషి తన జీవితకాలంలో ఎన్నెన్ని దృశ్యాల్ని మెదడు పొరల్లో పదిలం చేసుకుంటాడో! కొన్ని మాత్రం నిత్యనూతనంగా మనోనేత్రాల ముందు సాక్షాత్కరిస్తుంటాయి.*** ●